## క్లుప్తంగా

### అక్కాపూర్‌లో వైద్యశిబిరం



మాచారెడ్డి : మండలంలోని అక్కాపూర్‌లో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. కంటి, బీపీ,షుగర్,గుండె సంబంధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 3వందల మంది వృద్ధులు, దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ రాజన్న, జిల్లా డైరెక్టర్ బుచ్చిరెడ్డి,మండల చైర్మెన్ నవీన్ రెడ్డి, డాక్టర్ సతీష్,గ్రామస్తులు బాబు,రమేష్,ఎల్లయ్య,చంద్రం, నారాయణ ఉన్నారు.

### అటవీ సంరక్షణ అందరి బాధ్యత



రామారెడ్డి : అడవుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని అటవీ శాఖ సెక్షన్ అధికారిని జయశ్రీ అన్నారు. గురువారం అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం రామారెడ్డిలో అటవీశాఖ అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సెక్షన్ అధికారిని జయశ్రీ మాట్లాడుతూ మానవ జీవనం అడవుల సంరక్షణపై ఆధారపడి ఉందని, అడవులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారిని జయశ్రీ, శంకర్, రమణి,సుధీర్,శ్రీధర్ పాల్గొన్నారు.

### కొనసాగుతున్న పది పరీక్షలు

తాడ్వాయి (ఎల్లారెడ్డి) : మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా కొనసాగాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులు, బాలికల గురుకుల పాఠశాలలో 134 మంది విద్యార్థులు, మండలంలోని కన్‌కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 136 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎంఈవో రామస్వామి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144సెక్షన్ విధించారు.

### రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్‌కు సన్మానం



భిక్కనూరు : తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సగా నియమితులైన నేరేళ్ల శారదను యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు టీపీ విజయకుమార్‌గౌడ్ గురువారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెను జ్ఞాపికతో సత్కరించారు. మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి మహిళల అభ్యున్నతికి పాటుపడుతాని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

### ప్రభుత్వ సలహాదారుడికి..



కామారెడ్డి టౌన్ : ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కామారెడ్డి జిల్లా మాదిగ సంఘం ప్రతినిధులు వేముల బలరాం, కొక్కొండ భూమయ్య, చింతల రాములు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మాదిగ కార్పొరేషన్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### నిఫ్ట్‌లో ర్యాంకు సాధించిన వైష్ణవి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ముత్యాల వైష్ణవి జాతీయ స్థాయి నిఫ్ట్‌లో నిర్వహించిన ఎంట్రెన్స్‌లో ర్యాంకు సాధించినట్లు స్థానికులు గురువారం తెలిపారు. నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)లో 57 వేల మంది విద్యార్థులు ఎంట్రెన్స్‌లో పరీక్షలు వ్రాయగా జాతీయ స్థాయిలో 4710 లోపు ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా వైష్ణవిని తల్లితండ్రులు లక్ష్మీ- రామేశ్వర్‌రావు, స్థానికులు అభినందించారు.

### ప్రజల దాహార్తి తీరుస్తాం



బీబీపేట : వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు, ప్రయాణికుల తాగునీటి సమస్యను తీర్చడంలో ఛత్రపతి ఫౌండేషన్ ముందుంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరమాండ్లు అన్నారు. గురువారం బీబీపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. 13 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భూమాగౌడ్, ఏఈ దివ్యగాయత్రి, కార్యదర్శి రమేష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# యువత చేతిలో దేశ భవిష్యత్తు

- కాంగ్రెస్‌లో యువతకు సముచిత స్థానం
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



జుక్కల్‌లో యూత్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): భారత దేశ ఆర్థిక అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని, యువత చేతిలో దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. దేశ రాజకీయాల్లో యువతకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పించిందన్నారు. గురువారం జుక్కల్ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయం ఆవరణలో యూత్ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా పాలన చేస్తుందన్నారు. కొన్ని పార్టీలు కులాలు, మతాలు మధ్యన చిచ్చుపెట్టి, రాజకీయాలు చేస్తున్నాయన్నారు. యువతకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉందని, రాజకీయాల్లో యువత రాణించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీ హామీలతో పాటు అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఏమైనా సమస్యలు ఉంటే, వాటిని పరిష్కరిస్తామని పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపైన కాంగ్రెస్ జెండా ఎగరేద్దామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అస్పత్ వార్ వినోద్, అనిల్, రమేష్ దేశాయ్, అడ్వకేట్ రాంరెడ్డి, విఠల్, మచ్చేందర్ తదితరులు ఉన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన కుర్మ సంఘం సభ్యులు, నాయకులు గురువారం జుక్కల్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

**రైతులను ఆదుకుంటాం..**

బిచ్కుంద(జుక్కల్) : అకాల వర్షంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని తప్పక ఆదుకుంటామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం మండలంలోని హజ్గుల్ గ్రామంలో పంట క్షేత్రాలను సందర్శించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అకాల వర్షంతో పూర్తిగా దెబ్బతిన్నాయి పొగాకు, వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అధికారుల నివేదిక ఆధారంగా ఆదుకుంటామని పేర్కొన్నారు. గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాగఖనాథ్ పటేల్ మాజీ ఎంపీటీసీ సలీం, నాయకులు వినోద్ రైతులు ఉన్నారు.

## ఆస్పత్రులు నిబంధనలు ఉల్లంఘించవద్దు



తనిఖీలు చేస్తున్న వైద్యురాలు హిమబిందు

లింగంపేట(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీ, పీఎంపీలు ఆస్పత్రులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పీహెచ్‌సీ వైద్యురాలు హిమబిందు సూచించారు. గురువారం ఆమె లింగంపేట మండల కేంద్రంలోని పలు పీఎంపీ, ఆర్ఎంపీ ఆస్పత్రులను తనిఖీ చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు పీఎంపీ, ఆర్ఎంపీలకు నోటీలిచ్చారు. ఆయా ఆస్పత్రులకు ప్రథమ చికిత్సాలయం అని రాయాలని, బోర్డుపై డాక్టర్ అని రాయవద్దన్నారు. ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో బెడ్‌లు వేయవద్దన్నారు. తనిఖీ చేసిన వారిలో టీం రాజు, మల్లేష్, యు. రాజు, రాజేందర్, భాస్కర్, రషీద్, నాసీర్‌హుస్సేన్, తదితరులకు చెందిన క్లీనిక్‌లను తనిఖీ చేసినట్లు తెలిపారు.

## గురుకుల కళాశాల విద్యార్థినుల ప్రతిభ



ప్రోత్సాహకాలను అందుకుంటున్న విద్యార్థినులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు గురువారం తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వారి సౌజన్యంతో తెయూలో ప్రేరణ కార్యక్రమం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్, రంగోలి పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో భార్గవి, రవళి, ప్రథమ బహుమతి గెలుచుకోగా, రంగోలి పోటీల్లో సంధర్శిని గంగలక్ష్మి తృతీయ బహుమతిని గెలుచుకున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ రాధిక, కామర్స్ విభాగం అధ్యాపకులు స్రవంతి కుమారి, ప్రజ్ఞలు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేణుకా, అకాడమిక్ కోఆర్డీనేటర్ వనజ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో కొనసాగుతున్న మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో 2024–25కు గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24కు గాను నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులన్నారు. 5వ తరగతిలో 40 సీట్లు ఇందులో 30 సీట్లు మైనారిటీలకు 10 రిజర్వేషన్ ప్రకారం కేటాయిస్తారన్నారు. అలాగే 6, 7, 8 తరగతుల్లో పరిమితి సంఖ్యలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. వీటికి కేవలం మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌తో పాటు నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని వసతులు ఉచితంగా కల్పిస్తామన్నారు. విద్యార్థులకు ఉర్దూ, అరబ్బీ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. 7995057919, 9440228779లో సంప్రదించాలన్నారు.

### పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్తులు గురువారం ప్రత్యేక అధికారి, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కాటేపల్లి జీపీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ గ్రామ సభను ప్రారంభిస్తూ గ్రామస్తులు సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని, దోమలు పెరిగాయన్నారు. పలు కాలనీల్లో నీళ్లు రావట్లేదని ఆగ్రహించారు. ప్రత్యేకాధికారి ఒక్కసారి కూడా తమ గ్రామానికి వచ్చింది లేదని అధికారి నదీంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జూనియర్ లైన్‌మన్ ప్రశాంత్, ఐకేపీ వీఈవో సంతోష్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

### అవినీతి జరగడంతోనే రాజీనామా



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామ పీఏసీయస్ చైర్మన్ పెర్క శ్రీనివాస్ సొసైటీలో అవినీతి జరిగిందని దానిని కప్పి పుచ్చుకోవడం కోసమే రాజీనామ చేశారని డైరెక్టర్లు ఆరోపించారు. గురువారం సొసైటీలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నాటి నుండి రూ. 3 లక్షలు తన స్వప్రయోగనాలకు వాడుకున్నాడని, ఎరువులను స్వంత వారికి ఇచ్చి ఉపయోగించుకున్నారన్నారు. ఆడిట్ జరుగుతున్న సమయంలో రాజీనామా చేయడం వెనుక ఆంతర్యం ఏంటన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్‌లు మహెందర్ గౌడ్,బాలా చంద్ర ప్రసాద్,ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### వధువుకు ఆర్థికసాయం

భిక్కనూరు : మండలంలోని కాచాపూర్‌లో నిరుపేద పెళ్లికూతురుకు విద్యాదాత సుభాష్‌రెడ్డి గురువారం ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన చాకలి భూమని మల్లయ్య కొద్ది రోజుల క్రితం మృతిచెందాడు. ఆయన కుమార్తె ఇటీవల వివాహం నిశ్చయమైంది. ఆమెకు సుభాష్‌రెడ్డి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ మర్రి మైపాల్, యువకులు శివనందగౌడ్, కిష్టారెడ్డి, లింగం, భిక్షపతి తదితరులున్నారు.

### ఎల్లారెడ్డిలో ఫిజియోథెరపీ క్యాంప్



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పట్టణంలోని భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఫిజియోథెరపీ క్యాంప్‌లో దివ్యాంగులకు ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

### పోలింగ్ బూత్ పరిశీలన



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కేంద్రాన్ని గురువారం ఇంచార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్ పరిశీలించారు. పాఠశాలలో ఎన్నికలకు కావాల్సిన వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యయులు గంగా కిషన్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### సమాచారం..

**నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం**

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వీకేవీ కన్వెన్షన్‌లో సమావేశం ఉందన్నారు.

**నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే రాక**

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుక్రవారం రానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్మ సాయిబాబా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంప్ ఆఫీస్‌లో ప్రజలకు ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు.

**24న వాసవి సహకార సంఘ సమావేశం**

కామారెడ్డి అర్బన్ : వాసవి సహకార గృహనిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 24న ఆదివారం సాయంత్రం 4గంటలకు దేవునిపల్లి వాసవీకాలనీలోని సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం వేతన కార్యదర్శి డీవీఎస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

# కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

- బీఆర్ఎస్‌ను వీడిన ఆయా మండలాల నాయకులు
- షబ్బీర్ అలీ సమక్షంలో పార్టీలో చేరిక

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కామారెడ్డి మండలం నుండి చిన్న మల్లారెడ్డి గ్రామ మాజీ సర్పంచ్ రామగౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, ఎంపీటీసీ రాజు, కో–ఆప్షన్ మెంబెర్ ఫాజిల్, వార్డు మెంబర్లు తదితరులున్నారు. రాజంపేట మండలం నుండి బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కొప్పుల నరేష్, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు పుట్ట గణేష్, బీజేపీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు పందుల చిన్న స్వామి, బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు మీర్ జబ్బార్ అలీ, తదితరులు చేరారు.

దోమకొండ మండలం నుండి ముత్యంపేట్ గ్రామ మాజీ సర్పంచ్ కాటేపల్లి మనోహర్ రెడ్డి, మండలం రైతుబంధు అధ్యక్షుడు తాటిపల్లి తిరుపతిరెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కుర్ర అంజయ్య, అంచనూర్ మాజీ ఉప సర్పంచ్ కొమ్ము రమేష్, వార్డ్ మెంబర్ గంగారం, తదితరులు చేరారు. పాల్వంచ మాజీ సర్పంచ్ నారాగౌడ్, ఎంపీటీసీ గ్యార చంద్రం, మాజీ ఉప సర్పంచ్ బాల్ లింగం, కో ఆప్షన్ మెంబర్ వడ్లహరి, భవానిపేట్, ఎల్పుగొండకు చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ దేవరాజు గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఐరేని సందీప్, శ్రీనివాస్, పుట్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**బీబీపేట నుంచి..**

బీబీపేట: మండలంలోని మాందాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ అల్వాల రేవతి శ్రీనివాస్, పలువురు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ అధ్వర్యంలో పార్టీలో చేరారు.

**కామారెడ్డి రూరల్‌లో..**

కామారెడ్డి రూరల్ : మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామగౌడ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, ఎంపీటీసీ రాజు, కో–ఆప్షన్ సభ్యుడు ఫాజిల్, వార్డు సభ్యులు శ్రీనివాస్, నవీన్, కుంట శ్రీనివాస్, స్వామి, శేఖర్, పోచయ్య, రఘు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు సత్యం, బాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పంపరి రమేష్ తో పాటు సుమారు 100 మంది బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న ఆయా మండలాల నాయకులు

## ఆధారాల్లేకుండా డబ్బు తరలించొద్దు





నిజాంసాగర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు, బిచ్కుందలో..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని వెల్గనూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద గురువారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. సంగారెడ్డి– నాందేడ్ జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న ప్రైవేట్ వాహనాలను సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి ఆధారాలు లేకుండా డబ్బులు తరలించవద్దన్నారు.

**బిచ్కుందలో..**

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో గురువారం ఎస్సై మోహన్‌రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. గ్రామాల్లో బెల్టుషాపులపై దాడి చేసి మద్యం పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. కందర్‌పల్లిలో అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న సమాచారం మేరకు దాడి చేయగా చీప్‌లిక్కర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశామన్నారు.

**నాగిరెడ్డిపేటలో..**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : జిల్లా సరిహద్దులోని పోచారం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్‌లో జిల్లాలోకి ప్రవేశించే వాహనాలతోపాటు జిల్లాను దాటి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణంంగా తనిఖీ చేయాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ఆయన తనిఖీ చేశారు. నాగిరెడ్డిపేట ఎస్సై రాజు, ఏఎస్సై ఉమేశ్, ఇతర ఇబ్బంది ఉన్నారు.

**ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద..**

మాచారెడ్డి : మండలంలోని కామారెడ్డి సిరిసిల్ల రహదారి ఘన్ పూర్ స్టేజీ వద్ద పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద గురువారం రాత్రి ఓ వ్యక్తి వద్ద నుంచి రు2లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కామారెడ్డి వైపు నుంచి ఎల్లారెడ్డిపేట వైపు కారులో వెళ్తున్న రమేష్ అనే వ్యక్తి వద్ద నుంచి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో రు2లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

**భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద..**

భిక్కనూరు : మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద రూ. 1.85 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. మెదక్ పట్టణానికి చెందిన ఈగ వెంకట్‌రెడ్డి వాహనంను తనిఖీ చేయగా రూ. 95 వేల స్వాధీనం చేసుకున్నామని అలాగే ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన షేక్ అక్రమ్ వద్ద రూ. 90 వేలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటి వరకు భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద గత మూడు రోజుల్లో ఏడుగురు వ్యక్తుల నుంచి రూ. 6.99 లక్షలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు.



టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

## బీజేపీ మోర్చా అధ్యక్షుల ఎన్నిక



ఎన్నికైన బీజేపీ మోర్చా అధ్యక్షులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి పలు బీజేపీ మోర్చా అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లింగారావు గురువారం తెలిపారు. సుభాష్‌రెడ్డి కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యువ మోర్చా, కిసాన్‌మోర్చా, ఎస్సీ మోర్చా, ఎస్సీ, ఓబీసీ మోర్చా అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రవీందర్‌రావు, మండల అధ్యక్షులు నర్సింలు తదితరులున్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో గురువారం బీజేపీ మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇప్పటికే మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మాసుల శ్రీనివాస్‌తో పాటు మిగిలిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి వడ్ల రాంచందర్‌చారి, ఉపాధ్యక్షులు నవీన్‌కుమార్, గొల్ల సాయిలు, నారాయణ, మహేందర్, అనిల్‌కుమార్, సున్నం రాజు, సత్తెనపల్లి రాజు, కార్యదర్శులు రాజారాం సాయిలు, ముకుంద్‌రెడ్డి, సురేష్‌గౌడ్, దేవేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, మురళి, లింగారావు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**నియామకం**

కామారెడ్డి టౌన్ : జాతీయ కాంగ్రెస్ పార్టీ కిసాన్ కో ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన నీలం రమేశ్‌ను నియమిస్తూ జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

**జహీరాబాద్ ఓబీసీ మోర్చా కో–ఆర్డినేటర్‌గా మురళి**



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రానికి చెందిన మహరాజుల మురళిని జహీరాబాద్ ఓబీసీ మోర్చా కో–ఆర్డినేటర్‌గా నియమిస్తూ గురువారం రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ నియమించారు.

**అయ్యప్పను దర్శించుకున్న మాజీ జెడ్పీచైర్మన్**

నిజాంసాగర్(జుక్కల్) : కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప స్వామిని గురువారం మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు దర్శించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నాల్చర్ రాజు, విజయ్ తదితరులు ఉన్నారు.

**డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్‌కు సన్మానం**



నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కోఆపరేటివ్ చైర్మన్‌గా ఎన్నికైన రమేశ్‌రెడ్డిని గురువారం నిజాంసాగర్ మండల కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, ఏలె మల్లికార్జున్ మర్యాద పూర్వకంగా కలిశారు. డీసీసీబీ చైర్మన్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

**బాధిత కుటుంబానికి చెక్కు అందజేత**

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబానికి సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి రూ. లక్ష చెక్కును అందజేశారు. వ్యవసాయ సహకార సంఘంలో గడ్డం బల్‌రాం సభ్యుడు కాగా, గత సెప్టెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారన్నారు. దీంతో బీమా కింద రూ. లక్ష బాధిత కుటుం సభ్యులకు అందజేశామన్నారు. సొసైటీ సీఈవో సందీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి**



కామారెడ్డి క్రైం : పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పట్టణ ఎస్‌హెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. పట్టణ ఠాణాలో గురువారం పట్టణానికి చెందిన ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని వారితో పేర్కొన్నారు.